క్లుప్తంగా

క్షేత్ర పర్యటన ద్వారా వ్యవసాయంపై శిక్షణ



దుగ్గిరాల: ఎరుకలపూడి, పెదపాలెం, అత్తోట గ్రామాలలో తెనాలి సబ్ డివిజన్ ఏడీఏ కె.రాజకుమారి ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న సిబ్బంది శుక్రవారం ప్రత్యక్షంగా ప్రాకృతిక వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయి శిక్షణా కార్యక్రమంలో డెమో పద్ధతులలో బీజామృతం, ఘన, ద్రవ జీవామృతాం, నీమాస్త్రం, చీడపీడలను నివారించే వివిధ కషాయాలు తయారీ.. వాడే విధానాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు కృష్ణ ప్రసాద్, ఏవో ఆర్.విజయ బాబు, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అచ్చుతానందన్ సేవలు ఎనలేనివి



ఫిరంగిపురం: కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ సేవలు ఎనలేనివని సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం అచ్యుతానందన్ సంతాపసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ.. కేరళ రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకున్న ఘనత అచ్యుతానందన్‌కే దక్కుతుందన్నారు. ఆయన మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటని చెప్పారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు బి.ఇబ్రహీం, సామ్యూల్, సీహెచ్ రామారావు, సతీష్, అశోక్, ఒ.బాలయ్య, జి.వెంకటేశ్వరరావు, సునీత, ఏసు పాల్గొన్నారు.

28న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం

దుగ్గిరాల: కూటమి ప్రభుత్వంలో మాదిగలకు ఎటువంటి లబ్ధి జరగలేదని.. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ ప్రక్రియలో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని ఏపీ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగరాజు మాదిగ అన్నారు. శుక్రవారం చిలువూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం ఏటుకూరు గ్రామంలోని మాదిగ కమ్యూనిటీ హాలులో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాల సమావేశం జరుగుతుందని తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షులు ఉరుసుపాటి బ్రహ్మయ్య మాదిగ పాల్గొని కార్యకర్తలకు కూటమి పాలనలో జరుగుతున్న నష్టాన్ని తెలియజేస్తారని.. కార్యక్రమానికి అందరూ తరలి రావాలని ఆయన పేర్కొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శుక్రవారంతో 234వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని యూనియన్ కార్యదర్శి స్టీవెన్, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కె.ఆదినారాయణలతో కలిసి సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు ఇన్ని రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు నాగమల్లేశ్వరి, రిబ్కా, అంకమ్మ, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రగడ కోటయ్య జయంతి నేడు

తాడేపల్లి రూరల్: ప్రముఖ జాతీయ ఉద్యమ నాయకుడు స్వర్గీయ ప్రగడ కోటయ్య జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నామని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రగడ కోటయ్య 110వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని.. కార్యక్రమానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కళాకారుడికి ఆర్థిక సాయం

తెనాలిటౌన్: ప్రముఖ హరికథ భాగవతార్ నన్నపనేని సాంబశివరావు 10వ సంస్మరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పేద కళాకారుడు, వయోలిన్ విద్వాంసుడు నల్లపాటి కుటుంబరావుకు శుక్రవారం న్యాయవాది నన్నపనేని వాసంతి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

దోమల నిర్మూలనకు ఆయిల్‌బాల్స్ పిచికారీ



నీటి కుంటలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న ఆరోగ్యసిబ్బంది

ఫిరంగిపురం: సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'పీహెచ్‌సీ సమీపంలో నిలిచిన వర్షపు నీరు' అనే వార్తకు ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యశాఖ అధికారులు స్పందించారు. ఉదయాన్నే తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని నీటి కుంట వద్ద లార్వాను పరిశీలించారు. ఆయిల్ బాల్స్‌ను నీటి కుంటలో పిచికారీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్ఎస్ షేక్ అబ్దుల్ రెహమాన్, ఏఎన్ఎం లావణ్య, చిన్నమ్మ, ఆశా కార్యకర్తలు అంజలి, నిర్మల పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు తొలగింపు..

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వేమవరం వెళ్లే దారిలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు నిలిచి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే వార్త బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. కాగా శుక్రవారం పంచాయతీ సెక్రటరీ శౌరిజోజి దీనిపై స్పందించారు. పంచాయతీ సిబ్బందితో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీటిని తోడించారు. వాహనదారులు, పాదచారుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

రాజధాని ప్రాంతంలో గంజాయి బ్యాచ్ కలకలం



పట్టుబడిన గంజాయి

తాడికొండ: అమరావతి రాజధాని ప్రాంతంలో గంజాయి బ్యాచ్ కలకలం రేపింది. ఐనవోలులోని టిడ్కో గృహాలలో నలుగురు యువకులు గంజాయి తాగుతుండగా స్థానికులు యువకులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే వీరిలో కీలకమైన ఒక వ్యక్తి పరారీ అయినట్లు స్థానికులు తెలిపారు. వీరంతా నిర్మాణ రంగ పనుల నిమిత్తం వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన యువకులు కాగా విజయవాడకు చెందిన ఓ యువకుడు కూడా ఉన్నట్లు సమాచారం. రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న కార్మికులతో పాటు ప్రముఖ యూనివర్సిటీలలో చదువుకునే యువతే లక్ష్యంగా గంజాయి ఏరులై పారుతోందని.. నిఘా వ్యవస్థ పటిష్టంగా చర్యలు తీసుకుని యువతను పెడదారి పట్టిస్తున్న గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సీ, బీ సర్టిఫికెట్‌లు ప్రదానం



సర్టిఫికెట్‌లతో ఎన్‌సీసీ క్యాడెట్లు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ 22 ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన క్యాడెట్లకు సీ, బీ సర్టిఫికెట్‌లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ లెఫ్టినెంట్ వి.మౌనిక మాట్లాడారు. ఎన్‌సీసీలో పలు రకాల పరీక్షలు నిర్వహించిన అనంతరం క్యాడెట్‌లకు అందజేసే సీ, బీ సర్టిఫికెట్‌లు.. రక్షణ దళాలు, పోలీస్ విభాగం, సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్ వంటి పలు ఉద్యోగాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు ఎన్‌సీసీ వారు ఇచ్చే సీ సర్టిఫికెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. కేఎల్‌యూకు చెందిన విద్యార్థులలో మొత్తం 89 మంది సర్టిఫికెట్‌లను పొందారని అన్నారు. వారిలో సీ సర్టిఫికెట్ 35 మంది సాధించగా బీ సర్టిఫికెట్ 54 మంది సాధించారని తెలిపారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్‌కుమార్, సుబేదార్ మేజర్ గురుదీప్ కుమార్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సుభాకర్ రాజు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి లంబాడీపేటలోని ఓ దివ్యాంగుడికి వీల్‌చైర్, నిత్యావసర సరుకులను ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా (పీ–4) బంగారు కుటుంబ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వాసుపల్లి ప్రభాకర్‌కి రోటరీ క్లబ్, స్థానిక నాయకుల సహకారంతో వీల్‌చైర్, వారి కుటుంబానికి నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, నాయకులు దారా నాని, మురళీ, తాడిబోయిన భాస్కర్, వాసుపల్లి బాబూరావు, హరికృష్ణ, షేక్ బాజీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ



తరగతుల్లో పాల్గొన్న విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: నగర శివారు లాంఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార ప్రతినిధులకు (పీఏసీఎస్) సమగ్ర పోషక యాజమాన్యంపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి లాంఫాం ఏడీఆర్ డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం, మేనేజ్, సమేతి మంగళగిరి సంయుక్తంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమం ద్వారా పోషక యాజమాన్యంపై నిష్ణాతులైన శాస్త్రవేత్తల ద్వారా తరగతులు నిర్వహించి కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు ఎరువుల వినియోగంలో మెళకువలు, జాగ్రత్తలు తెలియజేస్తారని అన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మాట్లాడుతూ.. ప్రాథమిక సంఘం ప్రతినిధులు శిక్షణ కాలంలో నేర్చుకున్న వ్యవసాయ సమాచారాన్ని రైతులకు అందజేయడంలో పారా విస్తరణ అధికారులుగా విధులు నిర్వహించాలన్నారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏరువాక కేంద్రం, సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. ఆరు జిల్లాలైన ఏఎస్ఆర్ పాడేరు, అనకాపల్లి, గుంటూరు, చిత్తూరు, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల నుంచి 29 మంది సభ్యులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం 15 రోజుల పాటు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.వెంకటరాములు, సీనియర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించండి



మాట్లాడుతున్న ఉమాకాంత్

తెనాలిఅర్బన్: ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని మలేరియా తెనాలి సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా మారీసుపేట మఠంబజార్‌లోని మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వల్లో దోమలు గ్రుడ్లు పెట్టి సంతతిని ఉత్పత్తి చేసుకుంటాయని తెలిపారు. దోమలు కుట్టడం వలన డెంగ్యూ, మలేరియా, చికెన్ గూన్యా, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు సంభవిస్తాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ కండరాల నొప్పులు, కన్నుగుడ్లు వెనుక నొప్పు, శరీరంపై దద్దుర్లు వంటివి డెంగ్యూ లక్షణాలని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. అక్కడ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రంగిశెట్టి నగరాజకుమారి, కె.భవ్య, ఎం.వైష్ణవి, షేక్ షాహీనా, షేక్ నవీద్, సంకా శరత్‌బాబు, వాణి, పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ అలుపెరగని పోరాటం

తెనాలిటౌన్: విద్యార్థుల సమస్యలపై ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ అలుపెరగని పోరాటం చేస్తుందని ఆశాఖ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ మహాసభలు నిర్వహిస్తున్నారు. ఈ సభలకు శుక్రవారం ముఖ్య అతిథిగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కె.రామారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ విచ్చేసి ప్రసంగించారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐఎస్ఎఫ్ చేస్తున్న పోరాటాన్ని వివరించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ శాఖ నూతన కమిటీలు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.కిరణ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గండు శివ, సీపీఐ నాయకులు బొల్లిముంత కృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, కోలా శేఖర్, ఎం.నరేంద్ర, వి.సుధాకర్, గోపి, జె.శివ, ఏఐఎస్ఎఫ్ నాయకులు భూమేష్, తేజ, దుర్గాపవన్, అనిల్, విజయ్ పాల్గొన్నారు.

పునీత ఆంతోని దేవాలయానికి సహాయం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి గుండిమెడలో గల పునీత ఆంతోని వారి దేవాలయ పునః నిర్మాణానికి టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి కిరణ్ శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెవ. ఫాదర్ నల్లపాటి బాబు మాట్లాడుతూ.. దేవాలయ పునః నిర్మాణానికి కిరణ్ రూ.2.50 లక్షలను చెక్కు రూపంలో అందజేశారని అన్నారు. అందుకు ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గుండిమెడ రమేష్ బాబు, చిగురుపాటి సుబ్బారావు, అంకినీడు, పాములు, సంతోష్, ఏసుపాదం, సంఘస్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు!



తాడేపల్లి రూరల్: మంగళగిరి నవులూరు పుట్ట, తోట రోడ్డులో విద్యుత్‌స్తంభాల నుంచి విద్యుత్ తీగలు నేలపై పడి ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. వివిధ పనుల నిమిత్తం లారీ, ట్రాక్టరు వంటి వాహనాలు వస్తే వైర్లు తెగి పడుతున్నాయని వారు పేర్కొంటున్నారు. చేతికి అందేలా ప్రమాదభరితంగా తీగలు ఉండడంతో ఆందోళనగా ఉందని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి తీగలు పైకి ఉండేలా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నగర ప్రజలకు విజ్ఞప్తి!



తాడేపల్లి రూరల్: గత వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న గోడలు, పాత భవనాలు కూలే ప్రమాదం ఉందని.. కొండ చరియలు విరిగిపడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరాలకు ఎంటీఎంసీ వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నంబర్లు 70939 12653, 08645-295193కు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు. సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయాలి

దుగ్గిరాల: పసుపు బాధిత రైతులకు క్వింటాకు రూ.7 వేలు చొప్పున నష్ట పరిహారాన్ని వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వడ్డేశ్వరంలోని కేబీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వ ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన నగదును ఇంత వరకూ ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో జొన్న శివశంకరరావు, కాజా వెంకటేశ్వరరావు, ములక శివసాంబిరెడ్డి, వై.బ్రహ్మేశ్వరరావు, జెట్టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నగదురహిత లావాదేవీలపై అవగాహన ఏర్పరచుకోవాలి



తెనాలిటౌన్: డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, నగదు రహిత లావాదేవిలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని యూనియన్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ మేనేజర్ జి.శ్వేత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జేఎంజే కళాశాలలో విద్యార్థులకు డిజిటల్ చెల్లింపులు, నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శాంతకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ వి.ఆశోక్ కుమార్, చెంచుపేట ఎస్‌బీఐ మేనేజర్ శ్రీకాంత్ గుప్తా, రీసోర్స్‌పర్సన్స్ వై.బాబురావు, బి.నరసింహానాయక్, ఎం.రామకృష్ణ, వి.ప్రకాష్‌బాబు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలి



వనరుల రక్షణపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి రూరల్: ప్రకృతి మనకు అందించిన సహజ వనరులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని.. అందుకు ప్రజల్లో చైతన్యం రావాలని కేఎల్‌యూ విద్యార్థి విభాగాధికారి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మంగళగిరి మండల పరిధిలోని నూతక్కిలో యూనివర్సిటీ సీఎస్ఈ, ఏఐ అండ్ డీఎస్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి వనరుల రక్షణపై అవగాహన కల్పించారు. ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే గాలి, నీరు, భూమి, అడవులు, వన్యప్రాణులు, ఇంధన వనరులు, ఖనిజాలలో కొన్ని వనరులను దుర్వినియోగం చేస్తే పునరుత్పత్తి చేయలేమని వివరించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ప్రమాదముందని అన్నారు. సీఎస్ఈ, ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎ.సెంథిల్ అథితన్, డాక్టర్ వీఎస్‌వీ ప్రభాకర్‌లు మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లు, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి.సురేష్‌లను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ తదితరులు అభినందించారు.

పీ–4 పథకంతో పేదరిక నిర్మూలన

ఎంపీడీవో అత్తోట దీప్తి



జగ్గడిగుంటపాలెంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: పేదరిక నిర్మూలనకు పీ–4 పథకం దోహదపడుతుందని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ మండలం జగ్గడిగుంటపాలెం గ్రామంలో ఆమె సిబ్బందితో కలిసి పర్యటించారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి వారితో మాట్లాడారు. గ్రామంలోని తాటి చిట్టెమ్మ, ఎస్‌కె.మాబుల్, అనుమోలు కోటిరత్నంలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్ సరిపోవడం లేదని, కుటుంబానికి ఆసరా కల్పించాలని కోరినట్లు చెప్పారు. ఇంటి సమీపంలో చేతి పంపు ఏర్పాటు చేయాలని, వృద్ధురాలు ఉన్న ఇల్లు బాగు చేయించమని కోరినట్లు తెలిపారు. సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. వారికి ఆదాయం, ఆరోగ్యం నైపుణ్యపరంగా అండగా ఉండేందుకు ప్రభుత్వం పీ–4 పథకం కింద బంగారు కుటుంబాల జాబితాలో ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన నల్లపాడు పోలీసులు

గుంటూరు రూరల్: 'కంచే చేను మేస్తే కాసేదెవరు' అన్న చందంగా ఉంది నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానిక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. అతనికి భార్య.. ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. తన పెద్ద కుమార్తెను స్థానికంగా కార్ డ్రైవింగ్ చేసే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించాడు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. వాచ్‌మెన్‌కు ఐదుగురూ ఆడపిల్లలే అవ్వడంతో పెద్ద అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుని కొడుకు లేని లోటును తన అల్లుడులో చూసుకునేవాడు. ఇదిలా ఉండగా.. ఐదుగురిలో చివరి అమ్మాయి(ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న మైనర్)తో అల్లుడు చనువుగా ఉండేవాడు. ఆమెను గత పది నెలల క్రితం ఇంట్లో నుంచి తీసుకుని అల్లుడు పరారయ్యాడు. చిన్న కుమార్తె, అల్లుడు కనిపించకపోవడంతో తండ్రి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం అల్లుడిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం అల్లుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను మాయ మాటలతో తీసుకెళ్లినందుకు, తండ్రి ఫిర్యాదు మేరకు అల్లుడిపై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఏఎన్‌యూ అడ్మిషన్‌ల ప్రక్రియ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ మెకానికల్ బ్లాక్‌లో ఈఏపీ సెట్ 2025 అడ్మిషన్‌ల మొదటి విడత గురువారం ప్రారంభమయ్యింది. రెండో రోజు శుక్రవారం అడ్మిషన్‌ల ప్రక్రియను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధర్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం సందర్శించి అన్ని ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఇంట్రాక్ట్ అయ్యారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు అడ్మిషన్‌ల సందర్భంగా చేసిన అన్ని సదుపాయాలను, ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 70 శాతం మంది విద్యార్థులు రిపోర్ట్ చేయగా.. చివరిరోజు శనివారం కూడా విద్యార్థులు హాజరవుతారని ఆశాభావం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తాసిఫ్ అహ్మద్, అన్ని విభాగాల సమన్వయకర్తలు, ఆఫీసు సిబ్బంది, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

డీఎల్‌డీవో కార్యాలయాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు



డీఎల్‌డీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జ్యోతిబసు

తెనాలిటౌన్: డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా పరిషత్ సీఈవో వి.జ్యోతిబసు పేర్కొన్నారు. శుక్రవారం తెనాలి విచ్చేసిన ఆయన స్థానిక కొత్తపేటలోని డీఎల్‌డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డీఎల్‌డీవో కార్యాలయాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. డ్వామా ఎపీడీ, ఎస్ఆర్‌జీఎస్, డీఎల్‌పీవో కార్యాలయాలను ఒకే ప్రాంగణంలోకి తెచ్చి ప్రజలకు సేవలందించాలని జీవోనెం.57,58లను ఇటీవల విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం తెనాలిలో ఉన్న డీఎల్‌డీవో కార్యాలయ సముదాయం ఇందుకు సరిపోదని మరొక భవనాన్ని పరిశీలించి ఈ మూడు శాఖలను ఒకే ప్రాంగణంలోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో అత్తోట దీప్తి, డీఎల్‌డీవో శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

కంపోస్ట్ యార్డులో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలి

గుంటూరు రూరల్: నగర పాలక సంస్థ కంపోస్ట్ యార్డ్‌లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్‌కి తరలించాలని.. వాహనాల ట్రిప్‌లు, చెత్త బరువును వేయింగ్ మిషన్ ద్వారా చెక్ చేసి ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏటుకూరురోడ్‌లోని కంపోస్ట్ యార్డ్, బుడంపాడులో పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వార్డుల వారీగా సేకరించే వ్యర్థాలు అధిక శాతం ఏటుకూరు రోడ్ కంపోస్ట్ యార్డ్‌కి వస్తుందని, యార్డ్‌కి వచ్చే ప్రతి వాహనం ట్రిప్‌లు, తెచ్చే చెత్త బరువుని రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. వర్మి కంపోస్ట్ బెడ్స్ పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈను ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ సతీష్, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.